# రూపాయి విలువ

దంతపు భరిణి తెరచాడు.

ఒకసారి చేతిలోకి తీసుకొని అటూ ఇటూ త్రిప్పి చూచాడు—తృప్తితో, మందహాసంతో, స్పర్శసుఖం అనుభవిస్తూ; ఒక్క-రూపాయ!

అతని జీవితలక్ష్యం, జీవిత సమస్యలూ అన్నీ ఆ ఒక్క-రూపాయ చుట్టూ తిరుగుతూన్నట్లు ఎంత ప్రాణప్రదంగా చూచుకుంటున్నాడో! ఎన్నాళ్ళనుంచో!

. . .ఆ రోజులు వేరు.

అడిగినవారికి లేదనకుండా ఇచ్చేవాడు. తన జేబులోంచి రూపాయలు ఊరుతూ ఉన్నట్లే ఖర్చుపెట్టేవాడు.

అందరూ అతనిని "ధర్మదాత" అన్నారు. అతని ఔదార్యం వినూతన మన్నారు.

అతని ఇల్లు లక్ష్మీనివాసం; అతని ఇల్లాలు సాక్షాత్తు మహాలక్ష్మి అన్నారు.

నిజంగా, ఆమె ధర్మసత్రం నడిపింది.

ఆరోజులలో అతనికి రూపాయంటే లెఖ్ఖ లేదు.

ఇది నాది అనే భావం అసలే లేదు: తను అందరి కోసం ఆర్జిస్తున్నాడు. తన ఆర్జన ఖర్చుపెట్టుకోడానికి అందరికీ హక్కు-ఉంది.

తన సొమ్ము వాడుకున్నవారు తనకు ఋణపడినారని కాని, తనకు కృతజ్ఞత చూపాలని కాని అతను ఎప్పుడూ

అనుకోలేదు; తీసుకున్న సొమ్ము వారు తిరిగి ఇస్తారని ఎదురు చూడనూ లేదు.

*　　　*　　　*

ఉన్నట్టుండి పరిస్థితులు మారిపోయాయి.

హఠాత్తుగా అతని వ్యాపారం పడిపోయింది. రూపాయలు ఊట ఊరడం ఆగిపోయింది.

గట్టులేక ప్రవహించిన ధార సన్నగిల్లిపోయింది.

ఇంకేముంది!

స్వేచ్ఛగా అతని సొమ్ము వాడుకొని ఆనందించిన వారంతా ఇప్పు డతనిని చూచి ముఖం చాటుచేసుకుంటున్నారు. ప్రయత్నించి మరో త్రోవను వెళ్ళిపోతున్నారు.

అతనికి అర్థంకాలేదు.

స్వేచ్ఛగా సాగిన చేయి కుంటుపడింది.

—బాధతో అవమానంతో, నిరుత్సాహంతో కుమిలి పోయాడు;

తిరిగి కోలుకోలేకపోయాడు. ప్రయత్నించడానికి కూడా శక్తిలేకపోయింది. దినమొకయుగమైనా, ఎంత నిరుపయోగంగా గడిచిపోతున్నాయి రోజులు!

క్రమంగా. భార్య సణుగుడు ప్రారంభించింది. ఇంట్లో ఇదిలేదు, అదిలేదు అని గొణిగింది.

"అంత అశ్రద్ధేమిటి! పనులు చక్కబెట్టుకోకూడదూ" —అని మందలించింది.

చూసి, చూసి, ఒకో రోజు వంటకూడా మాని వేసింది.

భార్య ఎందుకిల్లా చేస్తోందో అతనికేమీ అర్థం కాలేదు...ఎంత ఆలోచించినా కొత్తపరిస్థితులు అతనికి అవగాహనకాలేదు. నీరులేని చేపలా అతని హృదయం వడలి పోతోంది.

ఆరోజు ఇల్లు వదలి వెళ్ళాడు. ఏమీ తోచకుండా తిరిగి బారెడు ప్రొద్దున్నదనగా కృష్ణఒడ్డుకు చేరుకున్నాడు. దాహం తెలియలా. ఆకలి తెలియలా. వడగాలి తెలియలా.

పొంగుతున్న అలలనుచూస్తూ, అవతలి ఒడ్డున మేఘాలను చూస్తో పొలాల్లో పనిచేసే రైతులను చూస్తో అట్టే ఉండి పోయాడు నదిఅంచున.

"బాబూ! మల్లెదండలు కొంటారా? - ఇవన్నీ ఇచ్చేస్తాను" - అంటూ, ఆశగా నవ్వుతూ అడిగింది ఆరేండ్ల అమ్మాయి. గంప చంకన బెట్టుకు ఇంటికి పోతోంది.

ఆ అమాయకురాలి ముఖం చూస్తే అతనికెంతో జాలివేసింది. రెండుచేతులతో దండలు తీసుకొని కళ్ళనద్దుకున్నాడు. పైరుగాలంతా ఒక్కసారి మల్లెవాసనలతో నిండి పోయింది.

"ఇదుగో!" అని జేబులో చెయిపెట్టాడు. ఖాళీ జేబు!

అతనికి భయమేసింది: తన జేబు ఖాళీగా ఉండవచ్చని అతనికి తోచలేదు.—దిగులుగా పువ్వులిచ్చేశాడు.

'పోనీ రేపే ఇద్దురుగాని బాబూ' అంది ఇచ్చిన పువ్వును తిరిగి తీసుకోవడం ఇష్టంలేక.

ఆమె అతనిని చూచి జాలిపడుతోందని గ్రహించాడు. తన దగ్గర ఒక్కదమ్మిడీ లేదు.

అతను పువ్వులు తీసుకోలేదు.

ఏదో అపరిమితమైన భయం అతనిని ఆవరించింది. ఆ అమ్మాయి జాలిచూపు మళ్ళీ మళ్ళీ కనబడుతోంది.

'—ఓహో! మీరా!'—ఎవరది?

'ఓహో! మీరా!......కులాసాగా ఉన్నారా'' అని పలుకరిస్తున్నాడు రామయ్య.

రామయ్య అని గుర్తించాడు కాని, జవాబియ్యలేదు. ప్రక్కనే కూర్చున్నాడు రామయ్య.

'అన్నట్టు—మీకు ఒక్క రూపాయివ్వాలండి, సేనా ళ్ళైంది'—అని తెల్లని క్రొత్తరూపాయ అతని చేతిలో పెట్టాడు.

'రూపాయా? నాకా?'—అని ఆశ్చర్యపోయాడు అతను. 'నాకు రూపా యెందుకియ్యాలి?'

'అదేమిటండీ! ఆవేళ ఊరెళుతూ దారిఖర్చుకని మీ దగ్గర తీసుకోలేదండీ. మరచిపోయారు కాబోలు,'— అంటూ లేచి వెళ్ళిపోయాడు రామయ్య.

ఎక్కడో, ఎప్పుడో అతనికి జ్ఞాపకంరాలేదు.

కాని, ఎందరు ఎన్నిసార్లు తన దగ్గర తీసుకున్నారో, ఒక్కరైనా తిరిగి ఇస్తారని తను ఎన్నడూ అనుకోలేదు. అసలు కాధ్యాసేలేదు. ఇప్పుడు రామయ్య ఎన్నడో తానిచ్చిన రూపాయి ఇంత జ్ఞాపకంగా తిరిగి ఇయ్యడం ఎంతో ఆశ్చర్య మేసింది.

అతని అరచేతిలో రూపాయ తెల్లగా తళతళా మెరిసింది.

ఆ రూపాయను చూస్తూ అతనికి కలిగిన ఆనందం తన జీవితంలో ఇదివరకు ఎన్నడూ కలుగలేదు......ఎన్ని రూపాయలు అతని చేతిలోంచి ధారగా పడి దొర్లిపోలేదు!

అతని కళ్ళు చెమ్మగిల్లాయి. ప్రాణంపోయినా, ఈ రూపాయను పోగొట్టుకోను అనుకున్నాడు.

ప్రొద్దు వాలుతూఉండగా ఇంటి ముఖంపట్టాడు.

ఇల్లు చేరగానే, ఆ రూపాయను దంతపు పెట్టెలో దాచుకున్నాడు.

* * *

అతని స్వభావం పూర్తిగా మారిపోయింది. మళ్ళీ రెండు చేతులతో ఆర్జించడం మొదలుపెట్టాడు—ఎంతో ఉత్సాహంతో, ఎంతో ఆసక్తితో. కాని, అతను మునుపటి మనిషికాడు: ఒక్కొక్క దమ్మిడీ కూడబెట్టడం నేర్చుకున్నాడు. బ్రహ్మదేవుడికైనా అతని చేతిలోంచి ఒక్క రాగిపైసా రాలదు.

'ధర్మదేవత!' అని అతనిని పొగడినవారే 'పరమ లోభి!' అన్నారు.

కాని, అతను వినిపించుకోలేదు.

ఇంటి ఖర్చుకుకూడా భార్యను ఎంతో ఇబ్బందిపెట్టే వాడు. ఎక్కడ దాచేవాడో తన ఆర్జన అంతా—ఆమెకు అర్థమయ్యేదికాదు. అతని ప్రవర్తన చూచి విస్తుపోయింది. అబ్బ! ఎంత ఇబ్బందిపడుతుంది!

* * * *

ఉన్నట్టుండి దంతపు భరిణిలో రూపాయ మాయమై పోయింది.

అతను నిర్ఘాంతపోయాడు !!

జారి పడిపోయిందేమో అని అలమారంతా వెదికాడు. ప్రతి కాగితం తీసి చూచాడు .ఇల్లంతా వెదికాడు.

ఆఖరికి భార్య నడిగాడు: ఈ దంతపు భరిణిలో రూపాయ తీశావా నువ్వు?—అని.

భయపడుతూ, చెప్పింది ఆమె: 'గాజులు కొను క్కున్నాను. ఎంతో బాగున్నాయి. చూడండి: ఎంత బాగు న్నాయో!'—అని చేతులు ముందుకు చాచింది.

అతను కుప్పకూలినట్టు పడిపోయాడు.

ప్రాణము పోయినా ఆ రూపాయ పోగొట్టుకో నను కున్నాడు—ఆ రూపాయతో ఆమె గాజులు కొనుక్కుంది! అతనికి నోటిమాట రాలేదు.

కోపగించుకోడానికి కూడా ధైర్యంలేదు. తన సర్వ స్వమూ పోగొట్టుకొన్నట్టు బాధపడ్డాడు.

ఆమె అతనివేదన చూచి కంట తడిపెట్టుకుంది...దగ్గ రగా వచ్చి మెల్లిగా అంది:

'ఎంతో బాగున్నాయి—గాజులు. కొనుక్కోవాలని పించింది. నాదగ్గర ఒక్కదమ్మిడీ లేదు. కొనకుండా ఉండ లేకపోయాను....మీ రింత బాధపడతారని తెలియదు'— అని, వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆమె బాధచూసి అతనికి అపరిమితమైనజాలి ముంచు కొచ్చింది. తన రెండుచేతులతో ఆమె ముఖాన్ని తన ముఖానికి చేర్చుకున్నాడు. తన చెక్కిలితో ఆమె కన్నీ ళ్లొత్తి ఓదార్చాడు.

'అబ్బా! అబ్బా! ఈ మాత్రానికే! ...కాని, ఆ రూపాయ విలువ నీకు తెలియదు. సావకాశంగా చెపుతా' అన్నాడు.

* * *

ఇప్పుడు మళ్ళా అతని చేతులలో రూపాయలు ధార గట్టినవి.

వారిల్లు మళ్ళీ 'లక్ష్మీనివాసం!'